క్లుప్తంగా

రేపు కంటి వైద్య శిబిరం

ప్రత్తిపాడు: రోటరీ క్లబ్ పెదనందిపాడు ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఈ నెల 25వ తేదీన ప్రత్తిపాడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కె.విక్టర్ పాల్, కార్యదర్శి వైకే రామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్ఆర్ఎస్ రెయిన్‌బో స్కూల్ ఆవరణలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరంలో వైద్య పరీక్షలు జరుగుతాయని చెప్పారు. నేత్ర పరీక్షలు చేయించుకోదలచిన వారు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ లను వెంట తెచ్చుకోవాలని సూచించారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ సభ్యులు కోరారు. శుక్లాల ఆపరేషను అవసరమైన వారికి వైద్యుల సలహా మేరకు ఉచితంగా కంటిలోపల అద్దం (ఐఓఎల్) అమర్చి ఆపరేషన్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

పంట వివరాలు నమోదు చేయించుకోవాలి

పెదకాకాని: రబీ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులందరూ పంట వివరాలను ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి తెలిపారు. వరి తరువాత వేసిన పంటల వివరాలు రైతులందరూ ఈనెల 26వ తేదీలోగా రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రకృతి వైపరీత్యాల నష్ట పరిహారం, సున్నా వడ్డీకే పంట రుణాలు, మద్దతు ధరకు పండించిన దిగుబడులను అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తప్పనిసరిగా రైతులు తమ పంట నమోదు ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ కోరారు.

భక్తిశ్రద్ధలతో జీర్ణోద్ధరణ ప్రతిష్ట ఉత్సవాలు

పాత గుంటూరు: నగరంలోని శ్రీ లక్ష్మీనారాయణపురంలో గల శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయ జీర్ణోద్ధరణ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం కర్మాంగ స్నపనం, లజాధివాసం, నయనోన్మీలనం తదితర పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజజీయరు స్వామి, శ్రీ త్రిదండి అహోబల రామానుజజీయరుస్వామి, శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజజీయరు స్వామి, శ్రీమాన్ ధనకుధరం సీతారామానుజాచార్యస్వామి పాల్గొన్నారు. అనంతరం విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాల్ని అందించారు. కార్యక్రమాన్ని ఆహ్వాన సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

నెహ్రూనగర్: ఎల్ఎల్ఆర్ (లో లెవెల్ రిజర్వాయర్) పరిధిలో 24, 25 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగం జాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా చేసే పైపులైనుపై శలపాడు, శుద్ధపల్లి డొంక వద్ద ఏర్పడిన లీకుల వల్ల తాగునీరు తక్కువగా సరఫరా అవుతోందని పేర్కొన్నారు. లీకులకు 25వ తేదీ నాటికి మరమ్మతులు పూర్తి చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారని తెలిపారు. ఎల్ఎల్ఆర్, ఎల్బీనగర్, బీఆర్ స్టేడియం రిజర్వాయర్ల పరిధిలో కొన్ని ప్రాంతాలకు 24, 25 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. 26వ తేదీ నుంచి యథావిధిగా జరుగుతుందని తెలియజేశారు.

మృతదేహం అప్పగించాలని బంధువుల ఆందోళన

గుంటూరు ఈస్ట్: మృతదేహాన్ని అప్పజెప్పాలని కోరుతూ బంధువులు జీజీహెచ్ అత్యవసర విభాగం వద్ద గురువారం ఆందోళన చేశారు. కేవీపీ కాలనీకి చెందిన నల్లబోతుల చెన్నమ్మ (50) అనారోగ్యానికి గురి కావడంతో బంధువులు ఆమెను జీజీహెచ్‌లోని అత్యవసర విభాగానికి గురువారం తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే, చెన్నమ్మ అనారోగ్యానికి నాటు మందులు వాడినట్లుగా బంధువులు చెప్పడంతో అనుమానించిన వైద్యులు ఎమ్మెల్సీ (మెడికో లీగల్ కేసు)గా నమోదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించబోగా మృతురాలి బంధువులు అడ్డుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది, అవుట్‌పోస్ట్ పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాపులో చోరీ

గుంటూరు ఈస్ట్: షాపులో బంగారు గొలుసు చోరీకి గురైన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటుకూరు రోడ్డులో ఎం.అంజమ్మ టీ దుకాణం నిర్వహిస్తోంది. గుర్తు తెలియని వ్యక్తి షాపు వద్దకు వచ్చి మంచి నీరు అడిగాడు. అంజమ్మ లోపలకు వెళ్లి మంచినీరు తెచ్చే సమయానికి సొరుగులో ఉన్న 24 గ్రాముల బంగారు గొలుసు చోరీ చేసి పరారయ్యాడు. బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యువకుడిపై దాడి

ఓ యువకుడిపై ముగ్గురు యువకులు దాడి చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డితోట 4వ లైనుకు చెందిన గాలిమేరి కుమారుడు ప్రేమ్‌కుమార్ ఆడుకునేందుకు 1వ లైనులోకి వెళ్లాడు. అక్కడ షేక్ సుభాని, దేవదాసు, శశి చిన్న విషయమై ప్రేమ్‌కుమార్‌తో గొడవ పడ్డారు. అనంతరం దాడి చేసి కొట్టారు. బాధితుడు ప్రేమ్‌కుమార్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

పెదకాకానిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గోళ్ల జ్యోతి

పెదకాకాని: బీసీలకు చట్టసభలు, రాజకీయాల్లో గౌరవ ప్రదమైన సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 స్థానాలు బీసీలకు కేటాయించడంపై పెదకాకానిలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకున్నారని ఆరోపించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో ఎన్నడూ లేని విధంగా 58 బీసీ కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్‌లుగా ఆయా సామాజిక వర్గాల వారిని నియమించి బీసీలను రాజకీయ చైతన్యవంతుల్ని చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో పాటు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో బీసీలు ఎదగాలనే పూలే ఆకాంక్షను సీఎం నెరవేరుస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ రాజకీయ పార్టీ బీసీలకు తగిన గుర్తింపు ఇవ్వలేదని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతనే బీసీలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్బార్, షేక్ షహనాజ్, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, సచివాలయం కన్వీనర్లు పమిడిమళ్ల అనిల్, ఆలా శ్రీనివాసరావు, పాగోలు అరుణ, పాగోలు శ్రీనివాసరావు, ఆర్థల గడ్డేశ్వరరావు, ఉప్పలపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎస్.దయానంద్, నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

గృహ సారథులు, కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



కన్వీనర్‌లు, గృహ సారథులకు కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

కాకుమాను: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలుపించుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత అన్నారు. మండల కేంద్రం కాకుమానులో గురువారం మండలంలోని సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, వలంటీర్‌లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ వచ్చే ఏడాది రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులందరినీ అఖండ మెజారిటీతో గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని ఆమె తెలిపారు. గృహ సారథులు, గ్రామ వలంటీర్‌లు సమన్వయంతో పని చేస్తు ప్రతి రోజు పది గృహాలను సందర్శించి గత మూడున్నర సంవత్సరాల నుంచి ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల గురించి వివరించాలని ఆమె సూచించారు. ఈసందర్భంగా సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులకు కిట్లు పంపిణీ చేశారు. తొలుత దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచి పసుపలేటి శివకుమారి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షులు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మెరిగల రవిబాబు, ఎస్సీసెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ పొన్నూరు షేక్ కరిముల్లా, పార్టీ గ్రామ అధ్యక్షుడు గొరిజవోలు రంగారావు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఏపీ టీచర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



టోర్నమెంట్ బ్రోచర్‌లను విడుదల చేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని కళాశాలల ఉపాధ్యాయులకు పురుషులు, మహిళల విభాగాలలో బ్యాడ్మింటన్ (షటిల్) టోర్నమెంట్ పోటీలను ఈనెల 25, 26వ తేదీలలో నిర్వహించనున్నట్లు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని చౌడవరం గ్రామంలోని కళాశాలలో టోర్నమెంట్ వాల్‌పోస్టర్, బ్రోచర్‌ల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో తమ కళాశాలలో ఈ టోర్నమెంట్ జరుగుతున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ నిరంతరం విద్యార్థులకు సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉత్తేజాన్ని కలిగించేందుకు ఈ క్రీడలు దోహద పడతాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే అభ్యర్థులు తమ పేర్లను ప్రత్యక్షంగా కానీ లేదా https://tinyurl. com/ dfrcjvd9 అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ముగింపు కార్యక్రమంలో ఏపీ కాలేజ్ టీచర్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వీరభద్రరావు, కళాశాల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ మద్దినేని జగదీష్, పాలకమండలి సభ్యులు పాల్గొంటారన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి తదితరులు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించి ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రకృతి వ్యవసాయం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ఎంతో కృషిచేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తూ 2027లక్ష్యంగా ఎక్కువ మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా కృషిచేస్తుందన్నారు. ప్రతి రైతు 365 రోజులు పంటతో భూమిని కప్పి ఉంచటం వల్ల రైతుకు, భూమికి మేలు జరుగుతుందన్నారు. పచ్చిరొట్ట పైర్లకోసం ఒకటి రెండు రకాల విత్తనాలు వినియోగించకుండా కనీసం 30 రకాల విత్తనాలు విత్తుకోవటం వల్ల జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. డ్రై ఏరియాలు విత్తన గుళికలను విత్తుకోవటం ద్వారా నీటి ఎద్దడిని తట్టుకోగలిగి మొలక శాతం పెరుగుతుందన్నారు. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో రైతులు 30 రకాల విత్తనాలతో పచ్చిరొట్ట పంటలు ఏవిధంగా విత్తుకున్నారు. యాజమాన్య పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో డీపీఎం జానకమ్మ, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు వేజండ్ల విద్యార్థినులు



వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పీఈటీ, ఉపాధ్యాయులు

వేజండ్ల(చేబ్రోలు): స్కూల్ గేమ్స్ అండర్ -14 బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. నరసరావుపేటలో ఈ నెల 14నుంచి 16వ తేదీవరకు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -14 బాలికల వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు విజయం సాధించింది. దీనిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వేజండ్ల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ సోనీ, మట్టుపల్లి సుమశ్రీ, పఠాన్ షాహెదాలు ఏపీ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్-14 బాలికల విభాగంలో రాష్ట్ర జట్టులో వీరు పాల్గొంటారని పీఈటీ తెలిపారు. వీరిని హెచ్ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఆకట్టుకున్న సర్వ దేవతల సంకీర్తన

పాత గుంటూరు: బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై గురువారం శ్రీ సీతారామాంజనేయ భజన బృందం సర్వదేవతల సంకీర్తనల భజన ఆకట్టుకుంది. పి. చిట్టిబాబు నిర్వహణలో పి. రాంబాబు, వీరయ్య, కె.వీరరాఘవమ్మ, పోతురాజు పలు వేంకటేశ్వరస్వామి భక్తి గీతాల్ని తాళం భజనతో శ్రావ్యంగా ఆలపించారు. ఆలయ సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నూతలపాటి తిరుపతయ్య పాల్గొన్నారు.

మద్యం తాగి ఆటో నడిపితే చర్యలు

గుంటూరు ఈస్ట్: మద్యం తాగి ఆటో నడిపితే చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఆటోడ్రైవర్లు, యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు తప్పక యూనిఫాం ధరించాలని, విధిగా లైసెన్సులు పొంది ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, పరిమితికి మించి ఎక్కువ మందిని ఎక్కించుకునే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. నేరస్తుల కదలికల్ని పోలీసు అధికారులకు తెలియజేసి సహకరించాలని కోరారు. సమావేశంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ పి.అక్కేశ్వరరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాల ఆరోగ్యమే లక్ష్యంగా పరిశోధనలు

ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్



ఏఎన్‌యూ: భావితరాల ఆరోగ్యమే లక్ష్యంగా పరిశోధనలు జరగాలని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ సూచించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో 'మొక్కలు, సూక్ష్మజీవుల పరిశోధనలో సరిహద్దులు' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు, భావి తరాలు వ్యాధుల నుంచి భద్రతను పొందడానికి సూక్ష్మ జీవుల పరిశోధన చాలా అవసరమని తెలిపారు. నైపుణ్యం, ప్రణాళిక మనల్ని కరోనా వైరస్ నుంచి ఎలా కాపాడిందో ప్రత్యక్షంగా చూశామని పేర్కొన్నారు. వ్యాధుల వల్ల దేశాల సరిహద్దులు సైతం మారాయని చెప్పారు. కార్యక్రమంలో త్రిపుర అగర్తలా ప్రభుత్వ ఎల్‌సీడీటీ డైరెక్టర్ వి. ప్రసాదరావు, ఉత్తరప్రదేశ్ లక్నో పరిశోధనా సంస్థ ప్రతినిధి నవీన్ కె. అరోరా, ఏఎన్‌యూ రిజిస్ట్రార్ బి. కరుణ, ఓఎస్‌డీ సునీత, సీడీఈ డైరెక్టర్ బి. నాగరాజు ప్రసంగించారు. పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టర్ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను గురువారం వీసీ పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్ ఆర్. విజయ ప్రకాష్ మాట్లాడుతూ 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ కాంపోజిట్స్ మెటీరియల్స్' అనే అంశంపై మార్చి 24, 25 తేదీలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోర్చుగల్ నుంచి ప్రొఫెసర్ పాల్ డార్విమ్, అమెరికా నుంచి మార్క్ జేమ్స్ జాక్సన్ ఆన్‌లైన్ ద్వారా పలు అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సదస్సు కో- కన్వీనర్ బి. పూర్ణచంద్రారావు, మెకానికల్ విభాగ కో-ఆర్డినేటర్ సీహెచ్. తిరుమలరావు, ఇన్నోవేషన్ సెంటర్ కో-ఆర్డినేటర్ ఎం. గోపీకృష్ణ, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ తౌసీఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

తప్పుడు రాతలతో విద్వేషాలు సృష్టిస్తున్నారు

పొన్నూరులో ఈనాడు ప్రతులను దహనం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చేబ్రోలు: గన్నవరం ఘటనలో టీడీపీ నేత పట్టాభి పాత ఫొటోలు ప్రచురించి, తప్పుడు వార్తలు రాయడం గర్హనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య సూచనల మేరకు ఈనాడు దినపత్రిక ప్రతులను స్థానిక ఐలాండ్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడారు. జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, ఆకుల వెంకటేశ్వరరావు, రుద్రపాటి ఆదిశేషులు, కొల్లేరు శ్రీనివాసరావు, జాలాది యానాది రావు, ఎండేటి వెంకటసుబ్బయ్య, గేరా సంజీవ్, మండ్రు అనిత, మూకిరి అనిలా కుమారి, షేక్ షర్మిల తదితరులు మాట్లాడుతూ పట్టాభి విజయవాడలో బూతు ప్రసంగాలు చేయడమే కాకుండా గన్నవరం వచ్చి వల్లభనేని వంశీని ఇష్టమొచ్చినట్లు తిట్టడంతో పాటు ప్రగల్భాలు పలికారన్నారు. అలాంటి వ్యక్తి గన్నవరం వచ్చి డ్రామా చేస్తే పట్టాభిని కొట్టారని, ఈనాడులో పేజీల కొద్దీ తప్పుడు వార్తలను వండి వార్చారన్నారు. పేజీల కొద్దీ బురద రాతలు రాశారన్నారు. పట్టాభిని పోలీసులు కాళ్లపై కొట్టారంటూ ఈనాడు ప్రచురించిన తప్పుడు ఫొటోలను సామాజిక మాధ్యమాలు గుర్తించి, బట్టబయలు చేశాయన్నారు. ఈనాడు తప్పనిసరై మొక్కుబడిగా సాంకేతిక పొరపాటుగా సింగిల్‌కాలమ్ వార్తను సవరణగా ప్రచురించిందన్నారు. తప్పని ఈనాడు ఒప్పుకున్నప్పుడు అదేరీతిలో వార్తను ప్రచురించాలన్నారు. ఈనాడు ఒక దినపత్రిక కాదుని చంద్రబాబు కరపత్రిక అని పట్టాభి ఉదంతంతో నిరూపణ అయిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి అధికశాతం ఎమ్మెల్సీ స్థానాలు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కేటాయించారన్నారు. ఇది జనంలోకి వెళ్తే ఆయనకు మరింతగా ప్రజాభిమానం పెరుగుతుందని టీడీపీ, ఎల్లో మీడియాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. పోలీసులు పట్టాభిని కొట్టనే లేదని వైద్యులు నివేదికలు ఇచ్చారని తెలిపారు. పోలీసులు చెప్పినా, ముఖ్యమంత్రిపై సీపీఐ నారాయణ అసత్య ఆరోపణలు చేశారన్నారు. పట్టాభి మాట్లాడిన భాష సీపీఐ నారాయణకు తప్పుగా అనిపించలేదా అని ప్రశ్నించారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో ఈనాడు దినపత్రికలను దహనం చేసి చంద్రబాబు, పట్టాభి, ఈనాడు, రామోజీరావులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



గోళ్లమూడిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను పరిశీలిస్తున్న ఏడీ డాక్టర్ అనిల్‌కుమార్

పెదకాకాని: మాతా శిశు సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని రాష్ట్ర మాతా శిశు సంరక్షణ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. మాతా శిశు రక్షణకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో డాక్టర్‌లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు నిర్వహిస్తున్న విధులను పరిశీలించేందుకు ఏడీ డాక్టర్ అనిల్‌కుమార్ గురువారం పెదకాకాని విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తిని సేవాభావంతో నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. మాతా శిశు సంరక్షణలో ఎటువంటి లోపాలు జరిగినా సంబంధిత డాక్టర్, ఏఎన్ఎంలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మండలంలోని గోళ్లమూడి గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటికీ తిరిగి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సరఫరా అవుతున్న తాగునీటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ చైల్డ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిరీష, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నారాయణస్వామి, ఏఎన్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ముత్యాలు

ప్రత్తిపాడు: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి ముత్యాలు (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ సంవత్సరం ఐదు ఎకరాలు పొలం కౌలుకి తీసుకొని రెండు ఎకరాల్లో మిరప, మూడు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసాడు. తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు, పెట్టుబడులకు సుమారు రూ.4లక్షల వరకు అప్పులు చేసాడు. వాతావరణం అనుకూలించక, తెగుళ్ల దాడితో దిగుబడులు ఆశించిన స్థాయిలో రాలేదు. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక ఈ నెల 21వ తేదీన అర్ధరాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు, కుటుంబీకులు చికిత్స నిమిత్తం గుంటూరులోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 22వ తేదీ సాయంత్రం మరణించాడు. ఈ మేరకు మృతుని కుమారుడు ప్రత్తిపాటి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ ఆరోగ్యరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అపరాల రైతులకు పురుగు నివారణపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఏఓ కిరణ్మయి

పాండ్రపాడు(కాకుమాను): ఈ ఏడాది రబీ ఈజన్‌లో మినుము, పెసర వంటి అపరాల సాగు చేస్తున్న రైతులు తమ పంటపై మారుకా మచ్చల పురుగు ఆశించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని పాండ్రపాడు, బోడిపాలెం, గరికపాడు గ్రామాలలో సాగు చేస్తున్న అపరాల పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం పంటపై అక్కడక్కడ మారుకా మచ్చల పురుగు కనిపిస్తుందని పంటపై పురుగు ఆశించకుండా వెంటనే నివారించుకోవాలని ఆమె సూచించారు. పురుగు నివారణకు ఎసిఫేట్ ఒక గ్రామ మందును లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని ఆమె తెలిపారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే స్పైనోశాడ్ ఎకరాకు వంద మిల్లీ లీటర్ల మందును నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. ఈనెల 25వ తేదీ నాటికి ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ తప్పని సరిగా నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న దాత దాసరి సత్యనారాయణ

పెదనందిపాడు: దేవాలయ అభివృద్ధి పనులకు దాతలు రూ.లక్ష విరాళాన్ని అందించారు. గురువారం మధ్యాహ్నం మండల పరిధిలోని నాగులపాడు వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి దేవస్థానం(నాగులపాడు పుట్ట)కు నాగులపాడు గ్రామానికి చెందిన దాసరి సత్యనారాయణ రూ.లక్ష నగదును ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సాంబశివరావు, కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ సభ్యులు స్వామి తీర్థప్రసాదాలను అందించారు.

అన్నపూర్ణాలయానికి రూ.లక్ష విరాళం..

పెదనందిపాడు: పెదనందిపాడు సాయిమందిర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న అన్నపూర్ణాలయానికి దాత రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం మధ్యాహ్నం పెదనందిపాడు సాయిమందిర్‌లో నాగులపాడు గ్రామానికి చెందిన మామిడిపాక రామచంద్రరావు సాయిమందిర్ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బాబావారి ప్రసాదాన్ని దాతకు అందించి అభినందనలు తెలిపారు.

ప్రకటనకర్తల నుంచి బకాయిలు వసూలు చేయండి

నెహ్రూనగర్: నగరంలో అడ్వర్టైజింగ్ బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన ఏజన్సీల నుంచి బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని సిటీప్లానర్‌ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బకాయిల వసూలుకు ఏసీపీ, టీపీఎస్‌లకు బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని చెప్పారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మీడియా డివైజ్ ఫీజుల వసూళ్ల వేగవంతం చేయాలని చెప్పారు. ప్రత్యేక బృందాల ద్వారా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, ఫీజులు చెల్లించని వారి బోర్డులను తొలగించాలని స్పష్టం చేశారు. బోర్డులకు క్యూఆర్ కోడ్‌తో పాటు జియో ట్యాగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రాంతాల్లో పోస్టర్స్ అంటించినా, బ్యానర్స్ కట్టినా పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని తెలిపారు. సమావేశంలో సిటీప్లానర్ మూర్తి, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, ఏసీపీలు కాలేషా, బాబూరావు, అశోక్ కుమార్, అజయ్ కుమార్, సూపరింటెండెంట్ ప్రసాద్, టీపీఎస్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు.